ప్రజాశక్తి
గురువారం 28 నవంబర్ 2024
5
విజయనగరం

పోక్సో కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం మహిళా పోలీసు స్టేషన్లో 2022 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో నిందితుడు పూసపాటి రేగ మండలం గుంపాం గ్రామానికి చెందిన లెంక శ్రీనివాసరావు (23) కు పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి 7ఏళ్ల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. పూసపాటి రేగ మండలానికి చెందిన 9 సంవత్సరాల బాలికపై గుంపాం గ్రామానికి చెందిన నిందితుడు లెంక శ్రీనివాసరావు అత్యాచారం చేసేందుకు ప్రయత్నం చేసినట్లు బాలిక తల్లి మహిళా పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ కె.టి.ఆర్ లక్ష్మి పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ కేసును అప్పటి దిశా మహిళా పిఎస్ సిఐ ఎం.శేషు దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేసారు. నేరం రుజువు కావడంతో జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ధాన్యం రైతుల నిలువు దోపిడీ

- నత్తనడకన ధాన్యం కొనుగోలు
- దళారులకు అమ్మేస్తున్న రైతులు
- తుపానుతో గుబులు

ప్రజాశక్తి-బొబ్బిలి

కళ్లాల్లో ఉన్న ధాన్యం బస్తాలు

ధాన్యం రైతులను వ్యాపారులు, దళారులు నిలువునా దోచేస్తున్నారు. జిల్లాలో తగినన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించకపోవడంతో రైతులు ధాన్యాన్ని దళారులకు, వ్యాపారులకు విక్రయించి మోసపోతున్నారు. క్వింటా ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర రూ.2300 నిర్ణయించినప్పటికీ వ్యాపారులు, దళారులు రూ.1750 నుంచి రూ.2,150 వరకు కొనుగోలు చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు.

జిల్లా వ్యాప్తంగా రెండు లక్షల 40వేలు ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. 2.40లక్షల ఎకరాల విస్తీర్ణంలో 5లక్షల 76వేల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉండగా, మూడు లక్షల 20వేల టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ ఇప్పటివరకూ జిల్లాలో 20శాతం మాత్రమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యాయి. వాటిలో కూడా ఇంకా పలుచోట్ల కొనుగోలు చేయడం లేదు. దీంతో దళారులు రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి కొంతమంది ఇతర జిల్లాలకు తరలించగా మరికొంత మంది రైతులు పేరు మీద ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు నిల్వ చేస్తున్నారు. రైతులు ఇ-క్రాప్ చేస్తే క్వింటా ధాన్యం రూ.2వేలు నుంచి రూ.2,150కు కొనుగోలు చేయగా ఇ-క్రాప్ లేకపోతే రూ.1750 నుంచి రూ.1900 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఇ- క్రాప్ లేకపోతే రైతుల పేరున మిల్లుకు ధాన్యం తరలించేందుకు అవకాశం లేకపోవడంతో తక్కువ ధర చెల్లిస్తున్నారు.

కళ్లాల్లో ధాన్యం బస్తాలు...పొలంలో వరి కుప్పలు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు తగ్గినన్ని ప్రారంభించక పోవడంతో పొలంలో వరి కుప్పలు దర్శనమిస్తున్నాయి. కొంతమంది రైతులు వరి నూర్పిడి చేసి ధాన్యాన్ని కళ్లాల్లో నిల్వ చేస్తున్నారు. మరోవైపు తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతుల్లో ఆందోళన నెలకొంది. పొలాల్లో ఉన్న వరి కుప్పలు, కళ్లాల్లోనూ ఉన్న ధాన్యబస్తాలు తడిచిపోతాయని ఆవేదన చెందుతున్నారు.

బొబ్బిలి మండలంలో పొలాల్లో ఉన్న వరి కుప్పలు

నత్తనడకన ధాన్యం కొనుగోలు

జిల్లాలో ధాన్యం కొనుగోలు నత్తనడకన సాగుతోంది. రైతులు వద్దకే సేవలు అందించేందుకు ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లాలో 27 మండలాల్లో 507 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో అక్కడక్కడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నప్పటికీ కొనుగోలు మాత్రం నత్తనడకన జరుగుతోంది.

105 కిలోలతో దళారుల దోపిడీ

రైతుల నుంచి వ్యాపారులు, దళారులు క్వింటా ధాన్యానికి ఐదు కిలోలు అదనంగా తీసుకుని దోపిడీ చేస్తున్నారు. గోనె సంచి బరువు కెజి లోపు ఉన్నప్పటికీ ఐదు కిలోలు అదనంగా తీసుకుంటున్నారు. ప్రభుత్వం క్వింటాకు రూ.2,300 ప్రకటిస్తే వ్యాపారులు, దళారుల రూ.1750 నుంచి రూ 2150 మాత్రమే చెల్లిస్తున్నారు.

మధుర స్మృతులను మిగిల్చేలా మెగా సమావేశాలు

పిటిఎంలపై రేపటి నుంచి కార్యాచరణ : కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని, మధుర స్మృతులను మిగిల్చేలా పండగ వాతావరణంలో నిర్వహించాలని ఉపాధ్యాయులకు కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. ఎంఇఒలు, హెచ్ఎంలతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి డిసెంబరు 7న నిర్వహించే ఈ మెగా సమావేశాలపై దిశానిర్దేశం చేశారు. విద్యార్థులు, వారి తల్లి తండ్రులు, ప్రజాప్రతినిధులు, స్ఫూర్తి దాయక వ్యక్తులను, పాఠశాల పూర్వ విద్యార్థులను, పాఠశాల యాజమాన్య కమిటీని, దాతలను దీనిలో భాగస్వాములను చేయాలని చెప్పారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, కెజిబివిల్లో కూడా ఈ సమా వేశాలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టును వివరించడంతో పాటు, పాఠశాల అభివృద్ధికి సలహాలు, సూచనలను తీసుకోవాలని చెప్పారు. సమావేశం ఉదయం 9 గంటలకు మొదలై, మధ్యాహ్నం 1 గంటకు చక్కని భోజనంతో ముగుస్తుందని వివరించారు. పాఠశాలకు ఒక ప్రజాప్రతినిధిని మాత్రమే ఆహ్వానించాలని సూచించారు. అదే పాఠశాలలో చదివి ఉన్నత స్థానానికి ఎదిగిన పూర్వ విద్యార్థులను ఈ సమావేశాలకు పిలిచి, వారి విజయగాథలను వివరించి విద్యార్థులను చైతన్యపరచాలని సూచించారు. ఉన్నతాధి కారులు, జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధి కారులు ఒక్కో పాఠశాలకు అతిధులుగా హాజరు అవుతారని తెలిపారు. కల్చరల్ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, తల్లితండ్రులకు రంగోలి, టగ్ ఆఫ్ వార్ తదితర పోటీలను నిర్వహిం చాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్లో డిఇఒ యు.మాణిక్యం నాయుడు,బిసి సంక్షేమాధికారి పెంటోజీరావు పాల్గొన్నారు.

డిసెంబర్ నాటికి చదువు మెరుగుపడాలి

ఇంటర్ విద్యార్థుల చదువు డిసెంబర్లో జరిగే అర్థ వార్షిక పరీక్షలలో మెరుగుపడాలనికలెక్టర్ డాక్టర్ అంబేద్కర్ ప్రిన్సిపాళ్ళను ఆదేశించారు. తన ఛాంబర్లో కళాశాల ప్రిన్సిపాళ్లతో బుధవారం సమీక్షించారు . క్వార్టర్లీ పరీక్షలలో జిల్లాలో 18 కళాశాలల్లో పాసైన విద్యార్థుల సంఖ్య 41శాతం మాత్రమేనని , అంత ఎక్కువ మంది ఫెయిల్ కావడానికి గల కారణాలపై ఆరా తీశారు. వెనకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక సమయం తీసుకొని శత శాతం ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని అన్నారు. 11 కళాశాలల్లో 50 శాతం కన్నా తక్కువ పాస్ అయ్యారని, వారి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దత్తి రాజేరు మండలంలో 2019లో కళాశాల మంజూరైందని, ఇప్పటికీ స్టాఫ్ గానీ, సదుపాయాలు గాని మంజూరు చేయలేదని, ప్రిన్సిపాల్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వానికి డిఒ లేఖ రాస్తామని తెలిపారు.

ఒక రోజు ముందే పింఛన్లు

ప్రజాశక్తి-విజయనగరంకోట

డిసెంబరు 1 ఆదివారం అయినందున ఒక రోజు ముందే శనివారం పింఛన్లు పంపిణీ చేయాలని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఎంపిడిఒలను ఆదేశించారు. బుధవారం ఎంపిడిఒలు, మండల ఇంజినీర్లు, ఎపిఒలతో ఉపాధి హామీ పనులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పింఛన్ కు అవసరమైన నగదును శుక్రవారమే డ్రా చేసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ కింద చేపట్టిన పనులను వేగవంతం చేయాలని, పూర్తయిన పనులను, బిల్లులను వేగంగా అప్లోడ్ చేయాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 2,200 పనులు మంజూరు చేయగా, ఇప్పటివరకు 2,012 ప్రారంభమయ్యాయని, 153 పనులు పూర్తయ్యాయని చెప్పారు. సమావేశంలో డ్వామా పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, జెడ్పి సిఇఒ బివి సత్యనారాయణ, పిఆర్ ఎస్ఇ ఎం.శ్రీనివాస్, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇ ఉమాశంకర్, సిపిఒ పాల్గొన్నారు.

అప్పన్న భూములపై సమాలోచన

ప్రజాశక్తి-విజయనగరం కోట

సమావేశంలో పాల్గొన్న అశోక్‌గజపతిరాజు, మంత్రి, ఎమ్మెల్యేలు

సింహాచలం దేవస్థానం పంచ గ్రామాల భూముల విషయమై సింహాచలం దేవస్థానం చైర్మన్ పూసపాటి అశోక్ గజపతి రాజు సమక్షాన జిల్లాకు చెందిన రాష్ట్ర చిన్న,మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు, విశాఖ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు టిడిపి కార్యాలయంలో చర్చించారు. అశోక్ గజపతిరాజు విశాఖ జిల్లా ఎమ్మెల్యేలతో మాట్లాడుతూ ఈ భూములు భక్తులు దేవుడికి ఇచ్చిన ఆస్తులని, రక్షణ విషయంలో స్పష్టత వస్తే పరిష్కారం వస్తుందని అన్నారు. ఈ విషయం తన తండ్రి నాటి నుంచి రగులుతున్న సమస్యగాఉందని, స్పష్టత ఉండి ముందుకు వెళితే ఎంత జటిలమైన సమస్యకైనా పరిష్కారం లభిస్తుందని అన్నారు. దేవాలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అనంతరం టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు విలేకర్లతో మాట్లాడుతూ దేవస్థానం భూముల సెటిల్మెంట్ నిమిత్తం చైర్మన్ అనుమతి కోసం వచ్చామని తెలిపారు. ఏదైతే 420 ఎకరాల భూమి ఉందో దానిపై ఇప్పటికే ప్రజలు నివాసాలు ఏర్పాటు చేసుకొని శతాబ్దాలుగా ఉంటున్నారని తెలిపారు. దానికి సరి సమానంగా 620 ఎకరాల భూమితో పాటు రెగ్యులైజేషన్ లో వచ్చిన డబ్బులు కూడా ఇస్తామని తెలిపారు. దీనికి చైర్మన్ అశోక్ గజపతిరాజు సానుకూలంగా స్పందించారని తెలిపారు. సమావేశంలో జిల్లాకు విశాఖ జిల్లా ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.రమేష్‌బాబు, ప్రభుత్వ విప్ గణబాబు, నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన

గ్రీన్ అంబాసిడర్లు, స్కూల్ ఆయాల ధర్నాలో సిఐటియు నాయకులు తమ్మినేని

ప్రజాశక్తి-లక్కవరపుకోట

ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిఐటియు, గ్రీన్ అంబాసిడర్లు

ఐక్య పోరాటాలతోనే హక్కులు సాధించుకోగలమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులు, స్కూల్ ఆయాల సమస్యలు పరిష్కరించాలంటూ బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ. పెట్టుబడిదారులకు చుట్టాలుగా ఈ రాజకీయ నాయకులు తయారయ్యారని, దేశాన్ని దోచుకునే దొంగలకు మోడీ కొమ్ముకాస్తున్నారని అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని ఏళ్ల తరబడి పోరాటాలు చేస్తున్నప్పటికీ మోడీ స్పందించడం లేదన్నారు. రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయన్నారు. తిరపతి లడ్డూపై ఉన్న శ్రద్ధ కార్మికుల హక్కుల కాపాడడంలోనూ,వారి సమస్యల పరిష్కారంలోనూ లేదన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యాలను కాపాడేది పారిశుధ్య కార్మికులేనని, ప్రభుత్వాలు గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డిసెంబర్ నెలలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల వద్ద ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాడి అప్పారావు, సిఐటియు మండల అధ్యక్షులు వెంకటరమణ, సిఐటియు నాయకులు చెలికాని ముత్యాలు పారిశుద్ధ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, స్కూల్ సీపర్లు పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న పలు సంఘాల నాయకులు

రాజ్యాంగాన్ని పరిరక్షించాలి

కెవిపిఎస్ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాజ్యాంగ దినోత్సవాన్ని అర్థవంతంగా నిర్వహించాలని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలని పలువురు వక్తలు అన్నారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రాకోటి రాములు అధ్యక్షతన జెడ్పి ఆవరణలోని యుటిఎఫ్ కార్యాలయంలో బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాహితీస్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాస్, ఆమ్ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు పి.రమేష్‌రాజు, భారత్ బచావో జిల్లా అధ్యక్షులు కరీం, బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంఘం నాయకులు బి.వెంకటరావు, జానపద కళాకారు సంఘం జిల్లా కన్వీనర్ షణ్ముఖ రావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరీష్ మాట్లాడారు. పాలక ప్రభుత్వాలు ప్రధానంగా బిజెపి ప్రభుత్వం కావాలనే రాజ్యాంగాన్ని, రాజ్యాంగ లక్ష్యాలకు, దాని స్ఫూర్తికి తూట్లు పొడుస్తోందని అన్నారు. అందులో భాగంగానే రాజ్యాంగ దినోత్సవాన్ని అందరికీ తెలిసేటట్లు చేయకుండా తూతూ మంత్రంగా జరిపి చేతులు దులుపుకుంటోందన్నారు. విభిన్న వైరుధ్యాలతో కూడిన భారతదేశాన్ని ఇప్పుడున్న పరిస్థితుల్లో ముందుకు నడిపించాలంటే రాజ్యాంగంలోని ప్రతి అంశాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. మనువాద శక్తుల చేతుల్లో రాజ్యాంగం నశించిపోకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క భారతీయునిపై ఉందని అన్నారు. అనంతరం సమావేశం తీర్మానాన్ని ఆమోదించింది. అనంతరం కవిపిఎస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్ రాజ్యాంగాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది.

అంగన్‌వాడీ కేంద్రాలకు సిఎస్ఆర్ నిధులతో వసతులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్రంలో కొన్ని అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు విజయనగరం మండలం కొండకరకాం గ్రామంలో గల మూడు అంగన్వాడీ కేంద్రాలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్)లో భాగంగా మూడు అంగన్వాడీ కేంద్రాల్లో గల చిన్నారులకు టివి, వంటపాత్రలు, ఆట వస్తువులు, స్టడీ మెటీరియల్ వాటర్ ఫిల్టర్ లు, బాటిల్‌లు వంటి సామాగ్రినిరాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు చేతులు మీదుగా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా సామాజిక బాధ్యతగా జిల్లాల్లో అనేక అంగన్వాడీ కేంద్రాలకు చిన్నారులకు కావలసిన సామాగ్రిని సమకూర్చినందుకు అమరావతి సర్కిల్ ఎపి ఇన్చార్జి అధికారి త్రిపాఠికి ధన్యవాదాలు తెలిపారు. కార్పోరేట్ సంస్థలు బాలలకు అవసరమైన విద్యా సామగ్రి, సమతుల్య ఆహారం,మౌలిక సదుపాయాలు,వసతి కల్పన గురించి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ ఎ.శాంతి కుమారి, నోడల్ అధికారి విజయలక్ష్మి, ప్రాజెక్టు అధికారి జి.ప్రసన్న, మిత్రా హోలిస్టిక్ హెల్త్ సొసైటీ చైర్మన్ లక్ష్మి రెడ్డి , ఎమ్‌డి పునితా రెడ్డి, ఎంపిటిసి ఆదినారాయణ , సచివాలయం , అంగన్వాడీ సిబ్బంది అరుణ కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోండి

జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్

ప్రజాశక్తి-గుర్ల

వ్యవసాయశాఖ సిబ్బందితో మాట్లాడుతున్న జెసి

తుపాను నేపథ్యంలో ధాన్యం తడవకుండా అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలను తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ సూచించారు. గుర్ల మండలంలో బుధవారం ఆయన పర్యటించారు. కెల్ల రైతు సేవా కేంద్రం, పిఎసిఎస్ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఇంతవరకు జరిగిన ధాన్యం కొనుగోలు, చెల్లింపులపై ఆరా తీశారు. మిల్లులకు సరఫరా చేసిన గోనె సంచుల నాణ్యతను పరిశీలించారు. తుపాను ప్రభావంతో జిల్లాలో కూడా వర్షాలు పడే అవకాశం ఉందని, అందువల్ల రైతులు అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలూ తీసుకొని, ధాన్యం తడవకుండా చూడాలని తెలిపారు. ఆయన వెంట వ్యవసాయశాఖ జెడి వి.తారకరామారావు, సివిల్ సప్లయిస్ డిఎం మీనాకుమారి, వ్యవసాయశాఖ ఎడి కోటేశ్వర్రావు, ఎఒ ఎ.తిరుపతిరావు, తాహశీల్దార్ ఆదిలక్ష్మి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రెండు రోజులు మహిళా పార్కు మూసివేత

విజయనగరం టౌన్ : మహిళా పార్కులో పాముల నియంత్రణకు ముందస్తు చర్యల్లో భాగంగా గుళికలు వేయడం జరుగుతుందని కావున రెండు రోజుల పాటు మహిళా పార్కు మూసివేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. గత కొన్నాళ్లుగా మహిళా పార్కులో పాముల సంచరిస్తున్నట్లు తమ సిబ్బంది గమనించారని, పాముల వల్ల ప్రమాదం జరగకుండా వాటిని తరలించేందుకు రసాయనాలతో కూడిన గుళికలను చల్లుతున్నట్లు తెలిపారు. ఉద్యాన శాఖ అధికారి ఉమా భరణి నేతృత్వంలో పాముల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు.

ముగిసిన విద్యుత్ ఉద్యోగుల క్రీడా పోటీలు

- అథ్లెటిక్స్‌లో ఓవరాల్ ఛాంపియన్‌గా తిరుపతి
- ద్వితీయ స్థానంలో విజయవాడ
- మూడో స్థానంలో విజయనగరం జట్టు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలో మూడు రోజులు పాటు జరిగిన విద్యుత్ ఉద్యోగుల అథ్లెటిక్స్, టేబుల్ టెన్నిస్ రాష్ట్ర క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. మూడు రోజుల పాటు అథ్లెటిక్స్ లో 100,400,800,1000 మీటర్ల పరుగు పందెం, రిలే, లాంగ్ జంప్, హై జంప్, త్రోబాల్, డిస్కస్ త్రో, టేబుల్ టెన్నిస్ లో సింగిల్స్, డబుల్స్ విభాగంలో క్రీడా పోటీలు జరిగాయి. బహుమతి ప్రదాన కార్యక్రమం స్థానిక క్షత్రియ కళ్యాణ మండపంలో జరిగింది. అథ్లెటిక్స్ విభాగంలో ఓవరాల్ ఛాంప్ గా తిరుపతి జిల్లా, ద్వితీయ స్థానం విజయవాడ, మూడో స్థానం లో విజయనగరం జిల్లా నిలిచాయి. విజేతలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎపిఇపిడిసి ఎల్ ఆపరేషన్ సర్కిల్ డైరెక్టర్ రామచంద్ర ప్రసాద్, జనరల్ మేనేజర్ ఎస్.మాసిలామణి , విద్యుత్ శాఖ ఎస్ఇ ఎస్.లక్ష్మణరావు, ట్రాన్స్‌కో ఎస్ఇ బాలాజీ చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. వ్యక్తిగత పోటీల్లో మొదటి,ద్వితీయ స్థానాల్లో నిలిచిన అథ్లెటిక్స్, టేబుల్ టెన్నిస్ విజేతలకు బహుమతులు అందజేశారు. డిసెంబర్ లో జరగనున్న జాతీయ అథ్లెటిక్స్, టేబుల్ టెన్నిస్ పోటీలకు రాష్ట్ర జట్టును ఎంపిక చేశారు. . ఈ సందర్భంగా ముఖ్య అతిధులుగా హాజరైన వారు మూడు రోజులు పాటు ఉత్సాహంగా క్రీడా పోటీలు నిర్వహించిన జిల్లా విద్యుత్ శాఖ అధికారులను,ఉద్యోగులను అభినందించారు.ఇదే స్ఫూర్తితో జాతీయ పోటీల్లో రాణించి రాష్ట్ర ఖ్యాతిని దేశ వ్యాప్తంగా ఇనుమడింప చేయాలని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల క్రీడా కార్యదర్శి పి.త్రినాధరావు, క్రీడాధికారి వడివేలు పాల్గొన్నారు. ఇటీవల జాతీయ స్థాయిలో ఆడిన క్రీడాకారులను ముఖ్య అతిధులు చేతులు మీదుగా సత్కరించారు.

షటిల్ కోర్టు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కంటోన్మెంట్ తపాలా శాఖ కార్యాలయం వద్ద నూతనంగా షటిల్ బ్యాడ్మింటన్ కోర్టును బుధవారం రిబ్బన్ కట్ చేసి తపాలా శాఖ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ ప్రారంబించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం నిరంతరం ప్రజలతో సంబంధాలు ఉండటంతో మనం శారీరకంగా , మానసికంగా ధృడంగా ఉండాలంటే క్రీడలు చాలా అవసరమన్నారు. మన ఉద్యోగులు కూడా అటువంటి ఒత్తిడి నుంచి బయటపడేందుకు ఆటలు.చాలా ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో తపాలా శాఖ హెడ్ పోస్టుమాస్టర్ డివిఆర్ శాస్త్రి, వి.శ్రీనివాసు ,తపాలా శాఖ ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీనివాసరావు, పతివాడ శ్రీనివాసరావు ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలి

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలో జాతీయ ప్రధాన కార్యదర్శి రంగరాజన్

ప్రజాశక్తి-విజయనగరంకోట

అభివాదం చేస్తున్న ఎఐఎస్ఎఫ్, సిపిఐ నాయకులు

ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకునేందుకు విద్యార్థులు సమరశీల పోరాటాలు నిర్వహించాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ రంగరాజన్ పిలుపునిచ్చారు. ఎఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలు బుధవారం నగరంలో ప్రారంభయ్యాయి. ఈ సందర్భంగా ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి గురజాడ కళాక్షేత్రం వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కె.రామకృష్ణ మాట్లాడుతూ ఎన్ఇపితో విద్యావ్యవస్థను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు నాశనం చేస్తున్నాయని అన్నారు. అనంతరం గురజాడ కళాక్షేత్రంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు అధ్యక్షతన జరిగిన సభలో రంగరాజన్ మాట్లాడారు. దేశంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్య వ్యవస్థ ప్రైవేటీకరణ, కార్పొరేటీ కరణ, కాషాయీకరణ గా మారిపోతోందన్నారు. జాతీయ విద్యా విధానంతో ఫెడరల్ వ్యవస్థతో ప్రభుత్వ విద్యావ్యవస్థ నాశనమవుతుందన్నారు. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ఇపిని వ్యతిరేకించి రాష్ట్రాల విద్యా విధానాన్ని అమలు చేయాలని కోరారు.

ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి జి.ఈశ్వరయ్య, రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.జాన్సన్‌బాబు, కె.శివారెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం పాఠ్యాంశాలలో మత భావాలు, మత విద్వేషాలు రెచ్చగొట్టే అంశాలు చేర్చుతోందని మండిపడ్డారు. నూతన విద్యా విధానం పేరుతో 52 వేల ప్రభుత్వ పాఠశాలలను మూత వేయడానికి కుట్ర చేశారని ధ్వజమెత్తారు. విశ్వ విద్యాలయాల్లో ఫెలోషిప్, స్కార్ షిప్పులు రోజురోజుకూ తగ్గిపోతున్నాయన్నారు. దేశంలో విద్యా హక్కు స్వేచ్ఛ కోసం రాబోయే రోజుల్లో సమరశీల పోరాటాలకు విద్యార్థులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనేక మంది ప్రాణ త్యాగం చేసి సాధించుకున్న విశాఖప్లాంట్‌ను ఏడు ప్రైవేటీకరణ చేయాలని చూడడం అన్యాయమన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలను కాపాడుకునేందుకు విద్యార్థులు ముందుకు రావాలన్నారు.

ప్రముఖ ప్రజాకవి, తెలంగాణ ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న మాట్లాడుతూ చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసి ఉరికొయ్యలపై వేలాడిన భగత్ సింగ్, అల్లూరి పోరాటాలద్వారా, వీరేశలింగం పంతులు, ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్, వివేకానంద, గురజాడ రచనలు, మాటలు, పాటల ద్వారా ఏ విధంగా దేశ స్వాతంత్ర్యానికి, ఐక్యతకు కృషి చేశారో విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా తన గేయాలతో విద్యార్థులను ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. కామేశ్వరరావు, జిల్లా కారక్యదర్శి ఒమ్మి రమణ, నాయకులు బుగత ఆశోక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రతినిధుల సభ ఆనందగజపతి ఆడిటోరియంలో ప్రారంభమైంది. తొలుత అమరుల స్థూపం వద్ద సిపిఐ నాయకులు, ఎఐఎస్ఎఫ్ నాయకులు నివాళులర్పించారు.

రేపు ప్రభుత్వ ఐటిఐలో జాబ్ మేళా

బొబ్బిలి: స్థానిక ప్రభుత్వ ఐటిఐలో ఈనెల 29న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్, ఐటిఐ, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. ఐటిఐలో శుక్రవారం ఉదయం 9 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని చెప్పారు. హెటిరో ఫార్మా కంపెనీ, అమెజాన్ వేర్ హౌస్, జాబు డీలర్స్ మొదలగు బహుళజాతి కంపెనీలలో ఉద్యోగాల కోసం ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ కాపీలు, బయోడేటా, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో సకాలంలో హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 9618792572, టోల్‌ఫ్రీ నెంబర్ 9988853335ను సంప్రదించాలన్నారు.

అవయవదానానికి ముందుకొచ్చిన యువకులు

బొబ్బిలి: అవయవదానం చేసేందుకు ఇద్దరు యువకులు ముందుకొచ్చారు. అభిమాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవయవదానంపై యువతకు చైతన్యం కల్పించడంతో దసంజయ్, హరీష్ అవయవదానం చేసేందుకు అంగీకార పత్రాలను అభిమాని ఫౌండేషన్ వ్యవస్థాపకులు రెడ్డి రాజగోపాల్‌కు అందజేశారు. అవయవదానానికి యువత ముందుకు రావాలని రాజగోపాల్ కోరారు.

మాజీ సైనికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

బొబ్బిలి: మాజీ సైనికులకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కిరణ్ కుమార్ కోరారు. బొబ్బిలి వచ్చిన రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను గురువారం కలిసి మాజీ సైనికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. మాజీ సైనికులకు 250 గజాల ఇళ్ల స్థలం ఇవ్వాలని, ఇసిహెచ్ఎస్ ఆసుపత్రి ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని కోరారు. మాజీ సైనికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

అన్నదానానికి మార్క్ ఫెడ్ చైర్మన్ విరాళం

నెల్లిమర్ల : నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో అన్నదానానికి మార్క్ ఫెడ్ చైర్మన్, టిడిపి నియోజకవర్గం ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు 10వేల రూపాయలు విరాళం అందజేశారు. బుధవారం స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహించిన అన్నదానానికి ఆయన విరాళం అందజేశారు. అనంతరం టిడిపి సభ్యత్వం నమోదును పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అవనాపు సత్యనారాయణ, కాళ్ల రాజశేఖర్, కింతాడ కళావతి, కాళ్ల సత్యవతి తదితర నాయకులు పాల్గొన్నారు.

లక్ష్యాలు పూర్తి చేయాల్సిందే : ఎల్‌డిఎం

వివరాలు నమోదు చేసుకుంటున్న ఎల్‌డిఎం

కొత్తవలస: స్వయం సహాయ సంఘాల శతశాతం లక్ష్యాలను పూర్తి చేయాల్సిందేనని లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.రమణ మూర్తి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం కొత్తవలస, ఎల్.కోట, వేపాడ జామి జాయింట్ మండల్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు వారికి సంబంధించిన పథకాల ప్రోగ్రెస్‌ను వివరించారు. ఈ సందర్భంగా ఎల్‌డిఎం రమణ మూర్తి మాట్లాడుతూ పిఎంఇజిపి, పిఎంఎఫ్ఎంఇ, ఎస్‌హెచ్‌జిల బ్యాంకు ఋణాలు, చిన్న సంఘాల అంతర్గత అప్పులపై శతశాతం టార్గెట్ పూర్తి చేయాలని ఆదేశించారు. డిపిఎం (బ్యాంకు లింకేజీ) ఎస్.రాజ్ కుమార్ రుణాలపై వివరించారు. సమావేశంలో ఎంపిడిఒ లక్ష్మణ్ రావు, మూడు మండలాల బ్యాంకు మేనేజర్లు, ఎపిఎంలు ఎ. వెంకటరమణ, జి.శ్రీనివాసరావు, డి.సూర్యనారాయణ, పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

నెల్లిమర్ల: చెరువు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని గొర్లిపేట గ్రామస్తులు ఆరసాడ నారాయణ రావు, నడుపూరు గౌరీ, పిన్నింటి గీత, జి. రాంబాబు, లెంక శంకర రావు బుధవారం తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన చింతల చెరువు, కొండల చెరువును కొంత మంది ఆక్రమించుకున్నారని అన్నారు. ఆక్రమణ వల్ల చెరువు కింద భూములకు నీరందకుండా పోతుందని, రెవెన్యూ అధికార్లు సర్వే జరిపి ఆక్రమణలు తొలగించాలని కోరారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో బంగారు పతకం

భోగాపురం: మండలంలోని తూడెం ఉన్నత పాఠశాలకు చెందిన సురేష్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో బంగారు పతకం సాధించాడని పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎల్. రమణబాబు తెలిపారు. ఈనెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు అనంతపురం జిల్లా కోనకొండలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించారని, అండర్ 17 విభాగంలో ఈ పతకం సాధించాడని చెప్పారు. అండర్ 14 విభాగంలో ఇక్కడ జరిగిన పోటీల్లో బాలురు, బాలికలు కూడా ద్వితీయ బహుమతులు సాధించారని తెలిపారు. విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు సిహెచ్ సత్యనారాయణతో పాటు తోటి ఉపాధ్యాయులంతా అభినందించారు.

మహిళ మృతిపై అనుమానాస్పద కేసు

భోగాపురం: మండలంలోని లింగాలవలస గ్రామానికి చెందిన కనకల మధులక్ష్మి (29) అనే వివాహిత మృతిపై పోలీసు అనుమానాస్పద కేసు నమోదు చేశారు. సిఐ ప్రభాకర్ అందించిన వివరాలు ప్రకారం... గ్రామానికి చెందిన మధులక్ష్మికి విజయవాడకు చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. ఆమె భర్త చనిపోవడంతో విజయవాడ నుంచి సొంత గ్రామం లింగాలవలస వచ్చేసింది. అప్పటికే ఆమెకు ఒక కుమారుడు ఉన్నాడు. తాపీ పని చేస్తున్న ఇదే గ్రామానికి చెందిన కనకల రామారావు అనే వ్యక్తిని 2019లో మరో వివాహం చేసుకుంది. వీరికి ఒక కుమార్తె జన్మించింది. భర్త మద్యానికి బానిసవ్వడంతో తరచూ భార్య భర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. ఆమె అతని ఊర్లో ఉన్న తల్లిదండ్రుల ఇంటికి వెళ్లిపోవడంతో మంగళవారం రాత్రి మళ్లీ ఇంటికి తీసుకువచ్చాడు. రాత్రి ఏమైందో తెలియదు కానీ ఆమె ఉరి వేసుకుని చనిపోయినట్లు బుధవారం వేకువజామున గ్రామస్తులకు కుటుంబ సభ్యులకు తెలియడంతో అనుమానంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సిఐ తెలిపారు. సంఘటనా స్థలాన్ని సిఐ ప్రభాకర్, ఎస్ఐలు పాపారావు, సూర్య కుమారి పరిశీలించారు. మృతురాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో అనుమానాస్పద కేసుగా నమోదు చేశారు. తహశీల్దార్ ఎం సురేష్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం వచ్చే నివేదికను బట్టి హత్య లేక ఆత్మహత్య అనేది తేలుతుందని సిఐ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

రామభద్రపురం: మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డు వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక గొల్లవీధి చెందిన శనగల మురళి (31) బొబ్బిలిలోని రాజావారి విందు హోటల్లో పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని బైక్‌పై స్వగ్రామం రామభద్రపురం వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మురళి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య జ్యోతితోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్ని నిముషాల్లో ఇంటికి చేరుతాడనుకున్న తరుణంలో ఈ ప్రమాదం జరగడంపై అతని కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. ఈ ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు ఎస్ఐ ప్రసాదరావు రెండు బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు తెలిపారు. బుధవారం బాడంగి సిహెచ్‌సిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎఎన్ఎంకు తీవ్ర గాయాలు

రామభద్రపురం: రోడ్డు ప్రమాదంలో వెనుక నుంచి లారీ ఢీ కొన్న ఘటనలో స్థానిక పిహెచ్‌సిలో ఎఎన్ఎంగా విధులు నిర్వర్తిస్తున్న ఆరికతోటకు చెందిన యజ్జల నీరజారాణి తీవ్రంగా గాయపడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నీరజారాణి తన విధుల్లో భాగంగా కొట్టక్కి గ్రామానికి భర్త మోహన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కొట్టక్కి జంక్షన్ వద్ద వెనుకనుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బండి నడుపుతున్న మోహన్, వెనుక కూర్చున్న నీరజారాణి గాయపడ్డారు. నీరజారాణికి తల వెనుక భాగంలో తీవ్ర గాయం కావడంతో స్పృహ కోల్పోయారు. వెంటనే ఇరువురిని సాలూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి నీరజను మెరుగైన వైద్యం కోసం విజయనగరం తిరుమల మెడి కవర్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

శృంగవరపుకోట: పట్టణంలోని బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో దాడి చేసి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వి.నారాయణమూర్తి బుధవారం తెలిపారు. ఈ వ్యక్తిపై గతంలో ఏడు కేసులు కూడా నమోదై ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం : మంత్రి

ప్రజాశక్తి - దత్తిరాజేరు

రైతు పండించిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పోరలి రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం టిడిపి ప్రధాన కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా వెనకబడ్డ మండలం దత్తిరాజేరేనని అందరూ సహకరిస్తే అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని అన్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోలు చేసి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ధాన్యం కొనుగోలులో ఎటువంటి అవకతవకలూ లేకుండా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్‌పిటిసి రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపిపి మిత్తిరెడ్డి రమేష్, మాజీ ఎంపిపి బెజవాడ రాజేశ్వరి, మండల పార్టీ అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్, మజ్జి మహేష్, బోడసింగి సత్తిబాబు, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి ఎస్ దుర్గాప్రసాద్, టిడిపి, జనసేన, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని పెదతాడివాడ రైతు సేవా కేంద్రం వద్ద రైతు ఒమ్మి పైడప్పలనాయుడుకు సంబంధించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసి ఎడిఎ ఎ.నాగభూషణం రైతుకు ట్రక్ షీట్ అందించారు. ఈ కార్యక్రమంలో ఎఒ పి.నిర్మల, ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

శృంగవరపుకోట: మండలంలోని వెంకటరమణపేట, తిమిడి గ్రామాలలో రైతు సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో నెలలు తరబడి డబ్బులు ఇచ్చే వారు కాదని, ఇప్పుడు చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ధాన్యం అమ్మిన 48 గంటల్లో డబ్బులు ఖాతాల్లో జమ అవుతున్నాయని తెలిపారు. ఇప్పటి వరకు రైతులు ఖాతాల్లో రూ.500 కోట్లకు డబ్బు జమ చేశామన్నారు. ధాన్యం కొనుగోలుల్లో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్మి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని, దళారులను నమ్మి మోసపోవద్దని హితువు పలికారు. వాతావరణంలో వస్తున్న మార్పుల దృష్ట్యా అధికారులు త్వరగా దాన్యం కొనుగోలును పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట మండల పార్టీ అధ్యక్షులు జిఎస్ నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ ఇందుకూరి శ్రీనురాజు, ప్రధాన కార్యదర్శి జుత్తాడ రామసత్యం, జనసేన నాయకులు వబ్బిన సత్యనారాయణ, నాయకులు కనిశెట్టి ఈశ్వరరావు, సలాది గంగరాజు, శేషు, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు: మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రేగిడ: మండలంలోని ఆర్ ఆముదాలవలస ప్రాథమిక సహకార సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని టిడిపి నాయకులు, సొసైటీ మాజీ ఉపాధ్యక్షులు దూబ ధర్మారావు, తహశీల్దార్ చిన్నారావు, ఎఒ గిరడ మురళీకృష్ణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు సేవ కేంద్రం ద్వారా ధాన్యం అమ్మకాలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఎండిన, నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన గ్రేడ్‌ల వారీగా రైతు ఖాతాల్లోకి చెల్లింపులు చేపడతామన్నారు. వీరితోపాటు రేగిడి సొసైటీ సిఇఒ గోవిందరావు, సిఒ గడే సురేష్, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

రామభద్రపురం: రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. మండల కేంద్రంలోని పిఎసిఎస్‌లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే బాధ్యతగా తీసుకొని దళారులు లేని మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ద్వారా సేకరణ చేసి 48 గంటల్లో బిల్లులు జమ చేసేందుకు సిఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారన్నారు. తేమలేని శుభ్రం చేసిన ధాన్యాన్ని తరలించి పూర్తి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతిరావు, కరణం విజయభాస్కర్, తహశీల్దార్ ఆకుల సులోచనారాణి, ఎఒ వి.వెంకటయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

ప్రజాశక్తి - విజయనగరంకోట

2030 నాటికి విజయనగరం జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చి దిద్దడానికి సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు పిలుపునిచ్చారు. బుధవారం మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో పీడీ బి.శాంతి కుమారి ఆధ్వర్యాన వెబ్ కాస్ట్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎపిడి విజయ్ కుమారి, యూత్ క్లబ్ బెజ్జిపురం ఎన్‌జిఒ డైరెక్టర్ ఎం. ప్రసాద్‌రావు, ఎన్‌జిఒ ప్రతినిధి జి.అప్పలనాయుడు, సిడిపిఒ ప్రసన్న, డిసిపిఒ వై.నాగరాజు, ప్రాజెక్టు సిబ్బందతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రమాణం చేయించారు. మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ కంటోన్మెంట్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కేసలి అప్పారావు పాల్గొన్నారు.

జామి: బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌గా మారాలని జిల్లా విద్యాశాఖాధికారి యు.మాణిక్యంనాయుడు పిలుపు నిచ్చారు. బుధవారం కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించి విద్యార్థినులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులందరికీ సాలూరు పట్టణానికి చెందిన అమెరికన్ ఎన్నారై యామలపల్లి యుగంధర్ అందజేసిన స్వెట్టర్స్ ను డిఇఒ తన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎకడమిక్ మోనెటరింగ్ టీం సభ్యులు, మండల విద్యాశాఖ అధికారి గంగరాజు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: బాల్య వివాహాలను నివారించేందుకు ప్రధానంగా తల్లిదండ్రులు, ఐసిడిఎస్ సిబ్బంది, పోలీసు శాఖ గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ సూచించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయం వద్ద ఉద్యోగులకు అవగాహన కల్పించారు.

వేపాడ: ఎంపిడిఒ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

బాల్యవివాహాలు ప్రోత్సహించడం నేరమంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాములమ్మ, ఎస్ఐ బి. దేవి, ఎంఇఒ పి. బాల భాస్కరరావు, ఎపిఒ ఆదిలక్ష్మి, అంగన్వాడి సూపర్‌వైజర్ భాగ్యవతి, సిహెచ్ఒ ఆంజనేయులు, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్త్ వర్కర్స్, సచివాలయ మహిళా రక్షకులు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఎస్ఐ ఎ. సన్యాసినాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బెజ్జిపురం యూత్ క్లబ్ ఎన్‌జిఒ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జిఒ డైరెక్టర్ ఎం ప్రసాదరావు, శ్రీనివాసరావు, ఎంఇఒ-2 రమణ, యూత్ క్లబ్ బ్రిడ్జిపురం సంస్థ ప్రతినిధులు శివశంకర్, శ్రీనివాస్, ఝాన్సీ రాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎంలు, మహిళా పోలీసులు, పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బాల్యవివాహాలపై ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాలేజీ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజాం : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ముక్తభారత్ కార్యక్రమం చేపట్టారు. ఎంపిడిఒ శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్య వివాహరహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పనిచేయాలని, ఆశా వర్కర్స్, కార్యాలయ సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు.

కొత్తవలస: కొత్తవలస స్థానిక న్యాయస్థానం జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి డాక్టర్ సముద్రాల విజయచందర్ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చనుందని దానికి అనుగుణంగా పాఠశాల విద్యార్థులచే ప్రతిజ్ఞచేయించారు. బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్థాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చీపురుపల్లి ఈశ్వరరావు, ఉపాధ్యాయులు, జిల్లా, కొత్తవలస న్యాయవాదులు పాల్గొన్నారు.

రాజాం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జూనియర్ సివిల్ జడ్జి విఎస్‌విబి కృష్ణ సాయి తేజ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ వివాహ వయసు పట్ల అవగాహన బాలల సంరక్షణ కోసం స్నేహపూరక న్యాయ సేవల పథకం, ఉచిత న్యాయ సహాయం, లీగల్ సెల్ అథారిటీ చట్టం, తదితర వాటిపై విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. బాల్య వివాహాలు చేసినవారు, వివాహం చేసుకున్నవారు, ప్రోత్సహించిన వారు అందరూ శిక్షార్హులన్నారు. ఈ సదస్సులో న్యాయవాదులు ఆర్. విజయ్ కుమార్, ఎం. శ్రీనివాసరావు, రాజం టౌన్ సిఐ కె. అశోక్ కుమార్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.నాగయ్య, ఉపాధ్యాయులు, టౌన్ పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

తెర్లాం: మండలంలోని నందబలగ గ్రామానికి చెందిన వడ్డీ ఇందిరా అనారోగ్యానికి గురై కొంతకాలంగా బాధపడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే బేబినాయన దృష్టికి తీసుకెళ్లగా ఆయన సిఎం సహాయనిధి నుంచి రూ.50 వేలు ఆర్థిక సహాయం అందేలా కృషి చేశారు. ఆ చెక్కును ఇందిరాకు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు, టిడిపి మండల నాయకులు ఎన్ వెంకటేశ్వరరావు, ఎన్ వెంకట్ నాయుడు, పాల్గొన్నారు.

నీటి సరఫరా కేంద్రం పరిశీలన

బొబ్బిలి: మండలంలోని భోజరాజపురం ప్రధాన నీటి సరఫరా కేంద్రాన్ని పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యస్. జ్యోతి బుధవారం పరిశీలించారు. ప్రధాన నీటి సరఫరా కేంద్రం వద్ద ప్రస్తుతం ఉన్న ప్యానెల్ బోర్డులను, వైరింగ్‌లను మార్చాలని, పైప్ లైన్లు లీకులను అరికట్టాలని, క్లోరినేషన్ లెవెల్‌లను నిర్దేశిత పరిమాణాలలో మెయింటైన్ చేయాలని సూచించారు. కమిషనర్ ఎల్. రామలక్ష్మి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.కిరణ్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ వివిఎస్ఎన్ ఈశ్వర గుప్త, సిబ్బంది పాల్గొన్నారు.

మండల పరిషత్‌లో ఆడిట్

వంగర: స్థానిక మండల పరిషత్ జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి ఆడిట్ అధికారి ఎంవిబిఎస్ రాజు బుధవారం పలు రికార్డులను తనిఖీ చేశారు. ఎంపిడిఒ త్రినాథరావుతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీనియర్ ఆడిటర్ ఎం రామేశ్వరరావు, ఇఒపిఆర్‌డి కెల్ల రామారావు పాల్గొన్నారు.

బుడా చైర్మన్‌గా తెంటు రాజా బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి అర్బన్ డవలప్మెంట్ అథారిటీ (బుడా) చైర్మన్‌గా తెంటు లక్ష్మునాయుడు (రాజా) బాధ్యతలు స్వీకరించారు. బుడా కార్యాలయంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే బేబినాయన, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు సమక్షంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బుడా పరిధిలో ఉన్న పట్టణాలు, గ్రామాల అభివృద్ధికి కషి చేస్తామని తెంటు రాజా అన్నారు. బుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజాకు మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే బేబినాయన, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, జనసేన నియోజకవర్గ ఇంచార్జి గిరడ అప్పలస్వామి, జనసేన కార్యనిర్వాహక కార్యదర్శి బాబు పాలూరి, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ మరిశర్ల రామారావునాయుడు, ఎఎంసి మాజీ చైర్మన్ పువ్వల శ్రీనివాసరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం కోటలో కూటమి నేతలు, కార్యకర్తలు రాజాను కలిసేందుకు క్యూ కట్టారు. జనసందోహంతో కోట కలకళలాడింది.

బాధ్యతలు స్వీకరిస్తున్న తెంటు రాజా, పక్కనే ఎమ్మెల్యే

కళలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విద్యార్థి దశ నుంచి కళలపై అవగాహన ఉండాలని డైట్ ప్రిన్సిపాల్ జి. పగడాలమ్మ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా సంస్థ (డైట్)లో జిల్లా స్థాయి బాల రంగ్ సంప్రదాయ జానపద నృత్య పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతో బాటు సంగీతం, సాహిత్యం, నృత్యం వంటి కళలను పాఠశాల దశ నుంచి నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మన జిల్లా జానపద నృత్యం, సంగీతానికి మంచి పేరు ఉందని ఆ దిశగా ప్రావీణ్యం సంపాదించాలని కోరారు. అనంతరం జిల్లా స్థాయిలో మొయిద జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు కర్ర సాములో ప్రథమ స్థానం సాధించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె. రామకృష్ణారావు, కోఆర్డినేటర్ పి.రవికుమార్, అధ్యాపకులు డి. ఈశ్వర రావు, మాతా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్

తెర్లాంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజాశక్తి - తెర్లాం

స్థానిక మండల పరిషత్ ఆవరణంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. డ్వామా ఇంఛార్జి పీడీ కళ్యాణ్ చక్రవర్తి హాజరై 33 పంచాయతీలకు సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహించారు. ప్రతి గ్రామంలో ఎన్ని వర్కులు చేశారు. ఎలా చేశారు? ప్రజలు ఏమైనా సమస్యలున్నాయా అని పరిశీలించారు. ఆడిట్ చేసిన వివరాలను పరిశీలించి చిన్నచిన్న లోటు పాట్లను సవరించారు. చాలా పంచాయతీల్లో మేట్లు హాజరు వేసినప్పుడు కొట్టివేతలు, మార్పులు ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ హాజరులో కొట్టివేతలు, మార్పులు చేసిన మేట్లను మార్పు చేయాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొరటాం ఫీల్డ్ అసిస్టెంట్ పనులు సక్రమంగా చేయించడం లేదని, పని చేయని వారికి మస్తర్లు వేస్తున్నారని కొంత మంది ఆరోపించగా సమగ్ర విచారణ చేపడతామని పీడీ తెలిపారు. ఇంతవరకు జిల్లాలో 18 సామాజిక ప్రజావేదికల్లో వచ్చిన ఫిర్యాదులు మేరకు రూ.1.29 కోట్లు రికవరీచ చేశామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా విజిలెన్స్ అధికారి వెంకట్రావు, ఎపిడి ఎం. శ్రీనివాసరావు, ఎస్ఆర్‌పి మన్మధరావు, ఎంపిపి ఎన్ ఉమాలక్ష్మి, ఎపిఒ సుశీల, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, సర్పంచులు అధికారులు పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోండి

ప్రజాశక్తి - వంగర

అల్పపీడన ప్రభావం కారణంగా వరికోతలను రైతులు వాయిదా వేసుకోవాలని ఎఒ టి.కన్నబాబు రైతులకు సూచించారు. మండలంలోని తలగాం, ఎం సీతారాంపురం, కొట్టిశ, కొప్పరవలస తదితర గ్రామాలలో ఆయన బుధవారం పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. వాతావరణం అనుకూలంగా లేని కారణంగా వరికోతలు వాయిదా వేసుకోవడం మంచిదన్నారు. దళారులను నమ్మి మోసవద్దని, రైతులు తమకు నచ్చిన మిల్లుకు ధాన్యం విక్రయించుకునేలా ఏర్పాట్లు చేశామని వివరించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

బాడంగి: రానున్న తుపాను నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎఒ శిరీష అన్నారు. కోడూరు వరి పొలాలను ఆమె బుధవారం పరిశీలించారు. 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు వర్షసూచన ఉండటం వల్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు. ఒకవేళ కోత కోసినట్లయితే, కుప్పలు వేసుకోవాలని, నూర్పు చేసిన ధాన్యం దగ్గర ఉన్న మిల్లుకు తరలించి కాపాడుకోవాలని చెప్పారు.

వంగర: రైతులకు సూచనలు చేస్తున్న ఎఒ కన్నబాబు

డెంకాడ: వర్ష ప్రభావం కారణంగా రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని, నూర్పిడి చేసిన ధాన్యంను వెంటనే రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి విక్రయించుకోవాలని ఎఒ నిర్మల సూచించారు.

మహిళల ఆర్థిక అభివృద్ధికి అర్బన్ మార్టులు : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహిళల ఆర్థిక అభివృద్ధికి మెప్మా అర్బన్ మార్టులు ఎంతగానో ఉపకరిస్తాయని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పేర్కొన్నారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద వివిధ స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను ప్రదర్శించడంతోపాటు, అమ్మకాలను చేపట్టే మెప్మా అర్బన్ మార్టను ఏర్పాటు చేశారు. రెండు రోజులపాటు ఈ మార్ట్ ప్రజలకు అందుబాటులో ఉంటుంది. స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక స్వావలంబనకు అర్బన్ మార్టులు ఉపయోగపడతాయ, ప్రజలు కూడా మహిళా ఉత్పత్తులను కొనుగోలు చేసి వారికి తోడ్పాటు అందించాలని కోరారు.

చెరువుల పరిరక్షణ అందరి బాధ్యత

నగరంలోని చెరువుల పరిరక్షణ, పరిశుభ్రత ప్రజలందరి బాధ్యత అని కమిషనర్ పల్లి నల్లనయ్య పేర్కొన్నారు. బుధవారం కోమటి చెరువు, నీలాటి చెరువు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. చెరువుల ఆవశ్యకతను అవసరాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో సత్తా

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన రుద్రమ దేవి స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించిన స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో సత్తా చాటారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిపిఎ. రాజు, స్కౌట్ మాస్టర్ రమేష్ నాయుడు తెలిపారు. పాఠశాల స్థాయిలో ప్రవేశ, ద్వితీయ స్థాయిలు పూర్తి చేసుకొని తృతీయ సోపాన్ పరీక్షకు అర్హత సాధించిన హాసిని, స్వరూప, దనుశ్రీ, మేఘన, హైందవిలు విజయనగరం ప్రాంతీయ శిక్షణ అండ్ క్యాంపింగ్ కేంద్రంలో జరిగిన తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్‌లో పాల్గొన్నారని చెప్పారు పరీక్ష అనంతరం రాజ్య పురస్కార్‌కు అర్హత సాధిస్తారని తెలియజేశారు. క్యాంపును పూర్తి చేసుకుని వచ్చిన విద్యార్థినిలను, స్కౌట్ విద్యార్థి చి. రాకేష్‌లను బుధవారం ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు జగన్నాథం, రవి శంకర్, గౌరీ,భవాని, గోవిందరావు, మునీషా, సన్యాసిరావు, తల్లిదండ్రులు అభినందించారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - వేపాడ

విద్యార్థినులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి బాగా చదువుకోవాలని ఎస్ఐ బి. దేవి అన్నారు. మండలంలోని బక్కు నాయుడుపేట బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు బుధవారం పలు అంశాలపై ఎస్ఐ అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ తప్పుడు అలవాట్లకు లోనై జీవితాలు పాడు చేసుకోవద్దని, బాలికలు తప్పుడు అలవాట్లకు లోనై ఆత్మహత్య చేసుకోవడం జీవితాలు నాశనం చేసుకోవడం మీకే నష్టమన్నారు. ఏదైనా ఇబ్బందులు వస్తే తన దృష్టికి తీసుకు రావాలని చెప్పారు. చెప్పుడు మాటలు విని మోసపోవద్దని చెప్పారు. విద్యార్థినులంతా తనలాగే ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉషారాణి, వసతి గృహం ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

104 సేవలు తనిఖీ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో వేపాడ పిహెచ్‌సి పరిధిలో గల 104 వైద్య సేవలను ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 109 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశామని డాక్టర్ ఎ. ధరణి అన్నారు. ఈ వైద్య సేవలో ఎంఎల్ హెచ్‌పి స్వాతి, హెచ్ఎ సాయి, డిఇఒ మోహన్, ఆశ కృష్ణమ్మ, డ్రైవర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
IP No.8/2024

Between:
పూసర్ల వెంకటేష్ ....పిటిషనర్
And :
లోలుగు భాస్కరరావు మరియు ఇతరులు ...రెస్పాండెంట్లు

నోటీసు

R.1: లోలుగు భాస్కరరావు S/o చిన్నంనాయుడు, వయస్సు 55 సం॥లు, R/o మురుగడం విలేజ్, బలిజిపేట మండలం, పార్వతీపురం మన్యం జిల్లా.
R.2: లోలుగు సాయికుమార్ S/o భాస్కరరావు, వయస్సు 30 సం॥లు, R/o మురుగడం విలేజ్, బలిజిపేట మండలం, పార్వతీపురం మన్యం జిల్లా.
R.3: సిరిపురపు లక్ష్మి W/o నాగరాజు, వయస్సు 50 సం॥లు, R/o చర్చి సెంటర్, బొబ్బిలి మున్సిపాలిటీ, విజయనగరం జిల్లా.
R.4: పొందూరు సత్యనారాయణ S/o రాము, వయస్సు 35 సం॥లు, R/o గొల్లపల్లి గ్రామం, బొబ్బిలి మున్సిపాలిటీ, బొబ్బిలి మండలం, విజయనగరం జిల్లా.
R.5: అల్లు సింహాచలం S/o లేటు సూరీ, వయస్సు 55 సం॥లు, R/o పణుకువలస గ్రామం, నియర్ మెట్టవలస గ్రామం, బొబ్బిలి మండలం, విజయనగరం జిల్లా.
R.6: యాళ్ల ప్రసాద్ S/o చిట్టిబాబు, వయస్సు 50 సం॥లు, R/o రేజేరు గ్రామం, బాడంగి మండలం, విజయనగరం జిల్లా.
R.7: ఉల్లా వైకుంఠరావు S/o వయస్సు సం॥లు, R/o దేవాంగులవీధి, బొబ్బిలి, విజయనగరం జిల్లా.
R.8: కోట్నన రామక్రిష్ణ S/o అప్పలస్వామి నాయుడు, వయస్సు 63 సం॥లు, R/o కోట సీతారాంపురం గ్రామం, బొబ్బిలి మండలం, విజయనగరం జిల్లా.
R.9: నందమూరి శేఖర్ S/o జగన్నాథరావు, వయస్సు 35 సం॥లు, R/o దాడితల్లి కాలనీ, బొబ్బిలి మున్సిపాలిటీ, విజయనగరం జిల్లా.
R.10: పాతిరెడ్డి మాధవి W/o శంకరరావు, వయస్సు 35 సం॥లు, R/o దేవాంగులవీధి, బొబ్బిలి మున్సిపాలిటీ, విజయనగరం జిల్లా.

ఇందుమూలంముగా తెలియజేయునది ఏమనగా ఇందలి పిటిషనర్లుపై Insolvency పిటిషనను మీ పై దాఖలు చేసి అందలి Insolvent గా డిక్లేర్ చేయమని దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్ తేది 04-12-2024న కలదు. పైన తెలిపిన రెస్పాండెంట్లు అందరూ మీ యొక్క ప్లీడర్ గారి ద్వారా గాని, స్వయంగా గాని లేక మీ యొక్క authorised person గాని కోర్టువారి ముందు హాజరు కావలెను. అటుల **తేది 04-12-2024న ఉదయం 10-30ని॥లకు** హాజరు కాని ఎడల మీ పరోక్షంలో కోర్టువారు వారి యొక్క పత్రాలను అనుసరించి తగిన తీర్పు ఇవ్వబడునని ఇందుమూలంముగా తెలియజేయడమైనది.

పై కోర్టువారు ఆర్డరు ప్రకారం
జె.శ్రీనివాసరావు
న్యాయవాది, బొబ్బిలి,
సెల్: 9440729960